## క్లుప్తంగా

### శ్రీ లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక మాసం ప్రారంభం కావడంతో శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈ సందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

### నైపుణ్యం పెంచుకోవాలి



ప్రసంగిస్తున్న విజయకుమార్

మదనపల్లె సిటీ : విద్యార్థులు వ్యక్తిగత నైపుణ్యాలను పెంచుకోవాలని స్టార్‌టప్ ఎంటర్‌ప్రైజెస్ ఫౌండర్ విజయకుమార్ అన్నారు. శనివారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ విద్యార్థులకు మోటివేషనల్ కార్యక్రమం నిర్వహించారు. సైబర్ డిఫరెన్స్ స్కిల్‌పై విద్యార్థులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ రామలింగారెడ్డి, ప్రెసిడెంట్ నాగమల్లారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### ప్రహరీ నిర్మించండి



కూలిపోయిన మార్కెట్ యార్డు ప్రహరీ గోడ

గుర్రంకొండ : స్థానిక మార్కెట్ యార్డు ప్రహరీ గోడ ఓవైపు కూలిపోయిందని, అందువల్ల మళ్లీ నిర్మించాలని రైతులు కోరుతున్నారు. మార్కెట్ యార్డుకు ఏడేళ్ల క్రితం ప్రహరీగోడ నిర్మించారు. కడప–బెంగుళూరు జాతీయ రహదారికి పక్కనే ఉన్న గోడ మొత్తం ఓవైపుకు కుంగిపోయింది. గతంలో కురిసిన వర్షాలకు ప్రహరీ గోడ మూడు చోట్ల పదిమీటర్ల మేరకు కూలిపోయింది. కూలిపోయిన గోడకు ఇంతవరకు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో పశువులు ఈ దారి గుండా మార్కెట్ యార్డులోకి చొరబడుతున్నాయి. మరమ్మతులు చేపట్టకపోతే మిగిలిన గోడ కుడా కూలిపోయే ప్రమాదముంది. అధికారులు స్పందించి వెంటనే ప్రహరీని నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

### పరామర్శ



రమణారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : మండలంలోని యర్రగుంటపల్లె పంచాయతీ బసిరెడ్డిగారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డివారి రమణారెడ్డి (63) మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శనివారం బసిరెడ్డిగారిపల్లెకు వెళ్లి రమణారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు దండు జగన్‌మోహన్‌రెడ్డి, హబీబ్‌బాషా, భానుప్రకాష్‌రెడ్డి, ఆనంద్, చక్రధర్, ఉదయ్, షాకీర్, మునీర్, ద్వారకనాథరెడ్డి, కాలనీ చిన్న పాల్గొన్నారు.

### జీతాల కోసం నిరీక్షణ

పెద్దతిప్పసముద్రం: అధికారంలో ఉన్న ప్రభుత్వానికి గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు గుండెకాయలాంటివారు. ప్రభుత్వం చేపట్టే ప్రతీ పనిని వెనువెంటనే పల్లె పల్లెకు తీసుకెళ్లేది వీరే. అలాంటిది ఆ ఉద్యోగులే జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలో ఏడుగురు గ్రేడ్-5 కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి రెండు నెలల నుంచి జీతాలివ్వకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిగిలిన మండలాల్లో గ్రేడ్-5 కార్యదర్శులకు ప్రతి నెల జీతాలు అందుతున్నాయి. ఈ విషయంపై ఈఓఆర్డీ యోగానంద్‌ను వివరణ కోరగా తంబళ్లపల్లిలో పని చేస్తున్న ట్రెజరర్ బదిలీ అయ్యారని వారి స్థానంలో పీలేర్‌కు చెందిన మరో అధికారిని ఇన్‌చార్జిగా నియమించడంతో జీతాలు కాస్తా ఆలస్యం అయ్యాయని తెలిపారు. ట్రెజరర్ బదిలీ అయితే తంబళ్లపల్లి ఖజానా కార్యాలయం పరిధిలోని పెద్దమండ్యం, ములకలచెరువు, తంబళ్లపల్లి మండలాల్లో పని చేసే గ్రేడ్-5 కార్యదర్శులకు జీతాలు ఎలా మంజూరయ్యాయని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని జీతాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

# అన్నదాతకు అగచాట్లు!

- నిరుపయోగంగా మినీ కోల్డ్ స్టోరేజీలు
- ఆరేళ్ల క్రితం కలికిరి, గుర్రంకొండలో ఏర్పాటు
- రూ. 70 లక్షల కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మాణం



గుర్రంకొండ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన మినీ కోల్డ్‌స్టోరేజీ

గుర్రంకొండ : పీలేరు నియోజకవర్గంలోని గుర్రంకొండ, కలికిరి మార్కెట్‌యార్డుల్లో ఆరేళ్ల క్రితం మినీ కోల్డ్‌స్టోరేజీలు (రిఫెలింగ్ ఛాంబర్స్) ఏర్పాటు చేశారు. 20 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన మినీ కోల్డ్‌స్టోరేజీలను అప్పట్లో రూ. 70 లక్షల కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించారు. గుర్రంకొండలో 10 మెట్రిక్ టన్నులు, కలికిరిలో 10 మెట్రిక్ టన్నులు మొత్తం 20 టన్నుల కూరగాయలు, పండ్లు ఇందులో నిల్వ ఉంచుకొనే సామర్థ్యం ఉండేటట్లుగా వీటిని ఏర్పాటు చేశారు. కోల్డ్‌స్టోరేజీల్లో కరెంటు లేని సమయాల్లో నిల్వ ఉన్న వస్తువులు పాడవకుండా ఉండేందుకు జనరేటర్లు కూడా ఏర్పాటు చేశారు. అయితే ఆరేళ్లుగా వాటిని వినియోగించక పోవడంతో తుప్పు పడుతున్నాయి. ఫలసాయాన్ని నిల్వ చేయకపోవడంతో అన్నదాతలు నష్టపోతున్నారు. దీంతో వారికి అగచాట్లు తప్పడం లేదు.

**అవగాహన లేక..**

మినీ కోల్డ్‌స్టోరేజీల వినియోగంపై రైతులకు, వ్యాపారులకు అవగాహన లేక పోవడంతో వీటిని వినియోగించలేదు. ప్రస్తుతం సరైన పద్ధతిలో వీటిని వినియోగించుకొంటే మంచి ఫలితాలు ఉంటాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు మినీ కోల్డ్‌స్టోరేజీల్లో పండ్లు, కూరగాయలు, ఇతర ఫలసాయాలు నిల్వ చేసుకునేందుకు మార్కెట్ కమిటీలోని అధికారులకు సదరు రైతు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తరువాత నిల్వ ఉంచే ఫలసాయాన్ని బట్టి ఇంజినీరింగ్ అధికారులు నిల్వ ఉంచే పండ్లు, ఇతర కూరగాయలకు ఒక టన్నుకు నెలకు ధర నిర్ణయిస్తారు. అధికారుల లెక్కల ప్రకారం ఒకటన్ను చింతపండును ఒక నెల రోజుల పాటు నిల్వ ఉంచుకోవాలంటే రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు రైతులు చెల్లించాల్సి ఉంటుంది. ప్రైవేట్ కోల్డ్‌స్టోరేజీలతో పోల్చితే వీటిలో ఛార్జీలు చాలా తక్కుగా ఉంటాయి. వీటిపై రైతులకు,వ్యాపారులకు సరైన అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

**భారంగా నిర్వహణ**

మినీకోల్డ్‌స్టోరేజీల నిర్వహణ అధికారులకు భారంగా మారాయి. ఎవరూ వినియోగించినా, వినియోగించక పోయినా వారానికి ఒకరోజు అన్ని యంత్రాలను ఆన్ చేసి కొద్దిసేపు రన్నింగ్‌లో ఉంచాలి. వీటితోపాటే జనరేటర్లను కూడా వాడుకలోకి తేవాల్సి ఉంటుంది. ఒక కోల్డ్‌స్టోరేజీకి సగటున నెలకు రూ. 2 వేలు నుంచి రూ. 5 వేలు వరకు కరెంటు బిల్లు వస్తుంది. సగటున ఏడాదికి రూ.60 వేల వరకు విద్యుత్ ఛార్జీల భారం పడుతోంది. రెండింటికి కలిపి రూ.1.20 లక్షల వరకు ఛార్జీల భారం పడుతోంది.

**అవగాహన కల్పించాలి**



మినీ కోల్డ్‌స్టోరేజీలపై వ్యాపారులకు, రైతులకు అవగాహన కల్పించాలి. చాలా రోజులుగా వినియోగించడం లేదు. కొంతమంది రైతులు తాము పండించిన పంటల్ని దగ్గరలోని కురబలకోట ప్రైవేట్ కోల్డ్‌స్టోరేజీలకు తీసుకెళుతున్నారు. స్థానికంగా ఉన్న వీటిని సద్వినియోగం చేసుకొంటే మంచి ఫలితాలు ఉంటాయనే విషయం అందరికి తెలియజేయాలి. ముఖ్యంగా రైతులకు, వ్యాపారులకు వీటి వలన ఎంతో ప్రయోజనం ఉంది.

– రామకృష్ణ, రైతు, గుర్రంకొండ

**వినియోగంలోకి తెస్తాం**



గుర్రంకొండ, కలికిరి మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన మినీకోల్డ్ స్టోరేజీలను త్వరలో వినియోగంలోకి తెస్తాం. గత ఏడాది కొందరు వినియోగించుకొన్నారు. పండ్లు, కూరగాయాలు స్టాకు ఉంచుకోవడానికి ఇవి బాగా ఉపయోగపడతాయి. యంత్రాలు పాడవకుండా వారానికి ఒకరోజు తప్పనిసరిగా కొద్దిసేపు యంత్రాలను వాడుకలోకి తెస్తున్నాం.

– కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

## గుంతలు లేని రోడ్లే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మిషన్ పాట్‌హోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గుంతల పూడ్చివేత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శనివారం మండలంలోని బొమ్మనచెరువు–పుంగనూరురోడ్డు మార్గంలోని నాయునివారిపల్లెలో మిషన్ పాట్‌హోల్ ఫ్రీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్రాంతికి ఆంధ్రప్రదేశ్‌లో గుంతలు లేని రోడ్లు వేస్తామన్నారు. రూ.860 కోట్లుతో రాష్ట్రంలోని మొత్తం గుంతలు పూడ్చేందుకు, ప్రజల సురక్షితవంతమైన ప్రయాణం కోసం మిషన్ పాట్‌హోల్ ఫ్రీ ఏపీ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ అరవిందాదేవి, నాయకులు మల్లికార్జున, బాబా, మల్లికార్జునాయుడు, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 7న బహిరంగ వేలం



బహిరంగ వేలం వివరాలు వెల్లడిస్తున్న ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ వి.శ్రీనివాసులు

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) మదనపల్లె డిపోలో నవంబర్ 7వ తేదీన గత ప్రభుత్వంలో మద్యం దుకాణాల్లో వినియోగించిన వస్తువులను బహిరంగ వేలం వేస్తున్నట్లు డిపో మేనేజర్ వి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండలంలోని వలసపల్లె గ్రామం జ్యూస్‌ఫ్యాక్టరీ ఏపీఎస్‌బీసీఎల్ డిపోలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎక్సైజ్ నూతనపాలసీ విధానం ప్రకటన తర్వాత ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేయడం జరిగిందన్నారు. మదనపల్లె డిపో పరిధిలోని 67 ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని ఫ్రీజర్స్ 65, ఇన్వర్టర్ విత్ బ్యాటరీ 67, క్యాష్ చెస్ట్ 75, స్కానర్స్ 240, క్యాష్ కౌంటింగ్ మెషిన్స్152ను ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ, అన్నమయ్యజిల్లా జేసీ ఆదేశాల మేరకు బహిరంగ వేలం వేసేందుకు నిర్ణయించామన్నారు. నవంబర్ 7వ తేదీ ఉదయం 10 గంటలకు మదనపల్లె మండలం వలసపల్లె జ్యూస్ ఫ్యాక్టరీ ఏపీఎస్‌బీసీఎల్ డిపో ఆవరణలో బహిరంగ వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగి ఉండి, రూ.5,000 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఆఫ్‌సెట్ ధర, నిబంధనల కోసం కార్యాలయ పనివేళల్లో డిపో మేనేజర్ 9866144462, అసిస్టెంట్ మేనేజర్ 8639494220, స్టోర్స్ ఆఫీసర్ 9701777938 నంబర్లపై సంప్రదించాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ కే.ఆదికేశవులునాయుడు, సీఐ ప్రశాంత్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

### ట్రాక్టర్ ఢీకొని భార్యాభర్తలకు గాయాలు

నిమ్మనపల్లె : ట్రాక్టర్ ఢీకొని భార్యాభర్తలు తీవ్రంగా గాయపడిన సంఘటన నిమ్మనపల్లె మండలంలో జరిగింది. సదుం మండలం గొల్లవారిపల్లెకు చెందిన సి.హరీష్ (30) తన భార్య రేవతి(25)తో కలిసి పలమనేరు మండలం పత్తికొండలో నివాసం ఉంటున్నాడు. శనివారం భార్యాభర్తలు ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంలో రేవతి పుట్టినిల్లు వాల్మీకిపురం మండలం చింతపర్తికి బయలుదేరారు. పుంగనూరు, బోయకొండ, నిమ్మనపల్లె మీదుగా చింతపర్తికి వెళుతుండగా మార్గమధ్యంలోని నల్లగొండ గ్రామ మలుపులో ముందు వెళుతున్న ట్రాక్టర్ అకస్మాత్తుగా డ్రైవర్ వాహనాన్ని వెనుకకు తిప్పడంతో ట్రాక్టర్ వెనుకే వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో రేవతి తీవ్రంగా గాయపడగా, హరీష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితులను 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

### భూముల రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ

తంబళ్లపల్లె : స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో సాంకేతిక కారణాలతో ఆగిపోయిన 17 గ్రామ పంచాయతీలలో భూముల రిజిస్ట్రేషన్ పునరుద్ధరించినట్లు జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసులు, సబ్ రిజిస్ట్రార్ ఉదయ్‌కిరణ్‌రెడ్డి శనివారం విలేకర్లకు తెలిపారు. తంబళ్లపల్లె మండలం పంచాలమర్రి, ఎర్రసానిపల్లె, కన్నెముడుగు, కోటకొండ, రేణిమాకులపల్లె, కుక్కరాజుపల్లె, మర్రిమాకులపల్లె, గంగిరెడ్డిపల్లె, కొట్లపల్లె, జంజురుపెంట, పెద్దమండ్యం మండలంలో సిద్దవరం, శివపురం, ములకలచెరువు మండలంలో చెన్నప్పగారిపల్లె, నాయునిచెరువుపల్లె, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలంలో జగడంవారిపల్లె, పులికల్లు గ్రామ పంచాయతీల్లో భూరిజిస్ట్రేషన్ నిలిపేశారు. దీంతో భూముల క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. విషయాన్ని రాష్ట్ర రిజిస్ట్రేషన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యను పరిష్కరించారు.

### గ్రామాల అభివృద్ధే ధ్యేయం

సంబేపల్లె : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. మండల కేంద్రంలోని వడ్డెపల్లె రోడ్డు మరమ్మతు పనులను వారు ప్రారంభించారు. ముందుగా మండలంలోని గురిగింజకుంట, దుద్యాల గ్రామాలలో మంత్రి పర్యటించి గ్రామ సభలలో ప్రజల సమస్యలపై ఆరాతీశారు.

## సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యఆరోగ్య సిబ్బంది

పీలేరు : సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి సూచించారు. తలపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతికూల వాతావరణ మార్పుల దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. అన్ని గ్రామ సచివాలయాల వద్ద ఉచిత వైద్యశిబిరాలు, వ్యాధుల నిర్ధారణ పరీక్షల నిమిత్తం రక్తపూతల సేకరణ, అధికార రక్తపోటు, మధుమేహ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. గూడరేవు పల్లెలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎంలు, సీహెచ్ఓలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# శునకం.. భయానకం



ములకలచెరువులో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

- హడలెత్తిస్తున్న వీధి కుక్కలు
- భయాందోళనలో ప్రజలు

ములకలచెరువు: మండలంలో పలు గ్రామాల్లో వీధి కుక్కలు హడలెత్తిస్తున్నాయి. ఆరు బయట ఆడుకుంటున్న చిన్నారులపై దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. వీధి కుక్కల సమస్య తీవ్రమవుతోంది. నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో అవి గుంపులు గుంపులుగా తిరుగుతూ పిల్లలు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. నిత్యం ఎక్కడో ఓ చోట కుక్క కాటుతో బాధితులు ఆసుపత్రిలో చేరుతూనే ఉన్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా రోడ్లపై సంచరిస్తూ దడ పుట్టిస్తున్నాయి. ఒంటరిగా వెళ్లాలంటే పిల్లలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు. మండలవ్యాప్తంగా రోజుకు రోజుకు శునకాల బాధితులు పెరిగిపోతున్నారు. ప్రతి రోజు ఇద్దరు,, ముగ్గురు కుక్క కాటుకు గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు సుమారు 300 మందికి పైగా కుక్క కాటుకు గురైనట్లు వైద్యాధికారులు తెలిపారు. కొందరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా మరికొందరు మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వ్యాక్సిన్లు తక్కువగా ఉండడంతో మందులు తెప్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి గ్రామాల్లో సంచరిస్తున్న కుక్కల బెడద నుంచి ఉపశమనం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

**మందులు తెప్పిస్తున్నాము**



కుక్క కాటుతో ఆస్పత్రికి వస్తున్న బాధితులకు మందులు సరిపడా ఉన్నాయి. కుక్క కాటు బాధితులు రోజు రోజుకు పెరుగుతున్నారు. వారి కోసం ఎప్పటికప్పుడు మందులు తెప్పిస్తున్నాము. యాంటీ రేబిస్ వైరస్ వ్యాక్సిన్లు బాధితులకు వేస్తున్నాము.

– జాహ్నవి రెడ్డి, ప్రభుత్వ వైద్యులు, ములకలచెరువు

## కనుల పండువగా కార్తీక మాసోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

పెద్దతిప్పసముద్రం : స్థానిక శివాలయంలో శనివారం కార్తీక మాసోత్సవాలు కనుల పండువగా ప్రారంభించారు. ఆలయ నిర్వాహకులు సనగరం పట్టాభి రామయ్య ఆలయంలో కార్తీక పాడ్యమి రుద్రాభిషేకం, మహా మంగళహారతి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 4న రుద్రాభిషేకం, రుద్రహోమం, 8న శ్రీ లక్ష్మి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, 11న అభిషేకాలతో పాటు కార్తీక దీపోత్సవం, 15న శ్రీ సత్యనారాయణ వ్రతం, 16న నవ గ్రహాలకు అభిషేకం, 18న శివ పార్వతుల కల్యాణోత్సవం, 22న శ్రీ లక్ష్మీ అమ్మవారికి పంచామృతాభిషేకం, 25న మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, పూర్ణాహుతి, 27న తులసి దామోదర పూజ, 29న శివునికి ఏకవార రుద్రాభిషేకం కార్యక్రమాలు జరుగుతాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక మాసోత్సవాలను విజయవంతం చేయాలని పట్టాభిరామయ్య కోరారు.

## అధికారులు బాధ్యతగా పని చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

కేవీపల్లె : అధికారులు బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పని చేయాలని సూచించారు. మండల స్థాయిలో పరిష్కామయ్యే సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ క్రాంతికుమార్, ఎంపీడీఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు : మండలంలోని ముడుపులవేముల పంచాయతీ బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద హేమచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. శనివారం మండలంలోని ముడుపులవేముల పంచాయతీ బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి శ్రీ రమాదేవి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సిబ్బంది ఎనిమిది విభాగాల్లో వైద్య సేవలు అందించారు.

**అందరూ కలిసి పనిచేయాలి**

కలకడ : మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి నాయకులు, అధికారులు కలిసి పనిచేయాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషన్‌కుమార్‌రెడ్డి కోరారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్యలు ఎక్కడ ఉన్న వెంటనే పరిష్కరించాలని ఏఈ ఇరగన్నను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో అధికారులు, మాజీ ఎంపీపీ వంగిమళ్ల మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న దినకర్ రెడ్డి

కురబలకోట : సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఐసీటీ అకాడమీ రాష్ట్ర అధిపతి ఎస్.దినకర్ రెడ్డి పేర్కొన్నారు. ట్రెండ్స్‌కు అనుగుణంగా స్కిల్స్ సాధిస్తే ఐటి రంగంలో కొలువులకు కొదువలేదన్నారు. శనివారం అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కేరీర్ కౌన్సిలింగ్ సెషన్‌లో ఐటీ రంగంలోని తాజా పోకడలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఐటీ రంగం ఎప్పటికప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డేటా సైన్స్, మెషిన్ లర్నింగ్, బ్లాక్ చైన్ మొదలైన సాంకేతికకల గురించి అప్‌డేట్‌లో ఉంటూ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. సాఫ్ట్ స్కిల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

## నాడు కళ కళ.. నేడు వెలవెల



టి.సదుం సచివాలయం

పెద్దతిప్పసముద్రం : మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్రాలను పల్లె ముంగిటకే తెచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిది. రైతులు, ప్రజలు ఈ కేంద్రాల్లోనే వారి సమస్యలను పరిష్కరించుకుంటూ వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిపాలన వ్యవస్థ ఇందుకు భిన్నంగా తయారైంది. ప్రధానంగా సచివాలయాల పరిధిలో మండల స్థాయిలో ఇటీవల జరిగిన అధికారుల బదిలీలు గందరగోళంగా మారాయి. తద్వారా నాడు ప్రజలతో కళకళలాడిన సచివాలయాలు ఇన్‌చార్జిల పాలనతో వెలవెలబోతున్నాయి. ఇక్కడ పని చేస్తున్న అధికారులు వేరే ప్రాంతాలకు బదిలీలు కావడంతో వారి స్థానంలో ప్రత్యామ్నాయంగా ఎవరినీ నియమించలేదు. దీంతో పక్క గ్రామాల అధికారులే అదనపు బాధ్యతలు చేపడుతున్నారు.

**ఆందోళనలో తల్లిదండ్రులు**

ప్రస్తుతం 10వ తరగతి విద్యార్థులకు జనన ధ్రువ పత్రం తప్పనిసరి చేశారు. ధ్రువపత్రాన్ని గ్రామ సచివాలయంలో తీసుకోవాలి. దీంతో గ్రామ పంచాయతీల్లో కార్యదర్శుల కొరత కారణంగా అధికారులు ఎప్పుడు ఏ సచివాలయంలో ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో పిల్లలు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 15 గ్రామ సచివాలయాలు ఉండగా అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయిలో లేరు. ముఖ్యంగా పట్టెంవాండ్లపల్లి- టి.సదుం, తుమ్మరకుంట -1, మద్దయ్యగారిపల్లి, పీటీఎం, పోతుపేట గ్రామాల్లో ఇన్‌చార్జులే పంచాయతీ కార్యదర్శులుగా పని చేస్తున్నారు. ముఖ్యంగా టి.సదుం, పట్టెంవాండ్లపల్లి -1 గ్రామాల్లో నలుగురైదుగురు చొప్పున అధికారులు మాత్రమే పని చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఖాళీగా ఉన్న అధికారుల పోస్టులను భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు కృషి



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

పెద్దమండ్యం : శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు అన్నారు. పెద్దమండ్యం పోలీస్ స్టేషన్‌ను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పలు రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో శాంతి భద్రతల విషయంపై ఆరా తీశారు. నాటు సారా తయారీ, విక్రయాలు, బెల్టుషాపులపై నిరంతరం నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ములకలచెరువు సీఐ రాజారమేష్, ఎస్ఐ పీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

## టౌన్‌బ్యాంక్ ఓటర్ల జాబితా విడుదల

మదనపల్లె : మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ పాలకవర్గ ఎన్నికకు నగారా మోగిన విషయం తెలిసిందే. నవంబర్‌లో జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఓటర్‌లిస్ట్ (ఏ-క్లాస్ మెంబర్ల లిస్ట్)ను బ్యాంక్ నోటీసుబోర్డులో ప్రచురించినట్లు సీఈఓ పీ.వి.ప్రసాద్ తెలిపారు. శనివారం టౌన్‌బ్యాంక్ ప్రధాన కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో బ్యాంక్ ఏ-క్లాస్ మెంబర్లు తమ వివరాలను బ్యాంక్ నోటీసుబోర్డులో పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఓటరుజాబితా పై ఎటువంటి ఆక్షేపణలు, అభ్యంతరాలు ఉన్నా 3వ తేదీ నుంచి ఏడురోజులలోపు అంటే 10వ తేదీలోపు బ్యాంక్ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. నవంబర్ 11న తుది ఓటరుజాబితాను ప్రకటిస్తామన్నారు. గుర్తింపుకార్డు లేని ఏ-క్లాస్ మెంబర్లు 2 పాస్‌పోర్ట్ ఫొటోలు, ఆధార్‌కార్డును బ్యాంక్‌లో సమర్పించి గుర్తింపుకార్డు పొందాలన్నారు.

## వీరభద్ర స్వామి ఆలయంలో బహిరంగ వేలం

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి తెలిపారు. ఆలయంలో విభూది పండు, దారాలు, కొబ్బరికాయలు అమ్ముకొనే హక్కు కోసం ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎలక్ట్రికల్ సామాన్లు సరఫరా చేసే హక్కు, ఆలయానికి సంబంధించిన గదులలో సీసీ కెమెరాలు 32, డీవీఆర్, కేబుల్ వైర్లు ఏర్పాటుకు కూడా వేలం పాట నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ వేలం పాట ఈనెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు ఉంటుందన్నారు. సీల్డ్ కవర్ల ద్వారా వచ్చిన వాటినే వేలం నిర్వహిస్తామని చెప్పారు.